సీడీని ఆవిష్కరిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ నాగజ్యోతి, బీఆర్ఎస్ నాయకులు

ఉద్యమాలే బీఆర్ఎస్ పునాదులు

ములుగు జడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి

మంగపేట, ఫిబ్రవరి 9 : ఉద్యమాలే బీఆర్ఎస్ పార్టీకి పునాదులని ములుగు జడ్పీ చైర్‌పర్సన్, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి అన్నారు. మండలంలోని రమణక్కపేటలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కే లక్ష్మీనారాయణ అధ్యక్షతన నిర్వహించిన కార్యకర్తల సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ ప్రజలను చైతన్య పరుస్తామన్నారు. ఈవిషయంలో ప్రజా పోరాటాలకు సిద్ధంగా ఉండాలని కోరారు. గతంలో జరిగిన వైఫల్యాలను సమీక్షించుకొని రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ జెండా ఎగురవేయడానికి కృషి చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అనంతరం రాజుపేట గ్రామంలో మద్దెల సమ్మక్క రాసిన నాగులమ్మ ఆడియో సీడీని ఆవిష్కరించి, ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈనెల 8న రమణక్కపేట శివారు గోదావరి నదిలో ప్రమాదవశాత్తు మృతి చెందిన ముస్కే గ్రీష్మంత్ మృతదేహానికి నివాళులర్పించి, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. నాయకులు కొమరం ధనలక్ష్మి, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, మాధరి రామన్న, కొమురం రామ్మూర్తి, కర్రి శ్యాం బాబు, ఏడుకొండలు, ప్రవీణ్, శ్రీను, చదలవాడ సాంబశివరావు, పండా శ్రీను, సోయం ఈశ్వర్, కొమురం పుల్లారావు, కర్రి శ్రీను, మలికంటి శంకర్, భద్రయ్య, తిరుపతి, సాంబయ్య, సునీత, రాయసాహెబ్, నాగవెంకటకృష్ణ పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ల నిర్వాహకుల దౌర్జన్యం

తాడ్వాయి, ఫిబ్రవరి 9 : మేడారంలో స్థానిక వాటర్ ప్లాంట్ల నిర్వాహకులు దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు. పస్రా, గోవిందరావుపేటతో పాటు వరంగల్, ఇతర ప్రాంతాలకు చెందిన నీళ్ల వ్యాపారులు మేడారంలో ప్లాంట్లు ఏర్పాటు చేసి నీటిని విక్రయిస్తున్నారు. పస్రాకు చెందిన రెండు టాటా ఏస్ వాహనాల్లో నీళ్లు నింపుకుని కన్నెపల్లి ఆర్చి గేట్ వద్ద గల పార్కింగ్ ప్రదేశంలో విక్రయిస్తుండగా స్థానిక ప్లాంట్ల నిర్వాహకులు ఇబ్బందులకు గురి చేస్తూ ఒక్కొక్కరు రూ.10 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. తామెందుకు ఇవ్వాలని ప్రశ్నించడంతో వారి వాహన టైర్లలో గాలి తీస్తున్నారు. బతుకుదెరువు కోసం నీళ్లు అమ్ముకునేందుకు వస్తే ఇలా ఇబ్బందులకు గురి చేయడం దారుణమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్తామని బాధితులు చెప్తున్నారు.

సూపరింటెండెంట్‌కు సమ్మె నోటీసు అందజేత

సూపరింటెండెంట్‌కు సమ్మె నోటీస్ అందిస్తున్న కార్మికులు

ములుగు రూరల్, ఫిబ్రవరి 9 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో పనిచేస్తున్న కార్మికులు శుక్రవారం సూపరింటెండెంట్‌కు సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలు, కనీస వేతనం కోసం ఈ నెల 16న జరిగే దేశ వ్యాప్త సమ్మెకు సంబంధించిన నోటీసులను తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు ఎంప్లాయీస్, శానిటేషన్ వర్కర్స్ యూనియన్ హెచ్ 52 ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అందజేసినట్లు తెలిపారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర కమిటీ సభ్యుడు పెద్దకాసు వినోద్, ములుగు వైద్యశాల అధ్యక్షుడు ఎనగందుల అనిల్ పాల్గొన్నారు.

గిరిజన నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

కాటారం, ఫిబ్రవరి 9 : సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) సహకారంతో లైఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గిరిజన నిరుద్యోగ యువతీ, యువకులకు ఉచిత శిక్షణను ఇవ్వనున్నట్లు ప్రాజెక్ట్ మేనేజర్ బొడ్డు రాజబాబు తెలిపారు. కాటారంలోని వైటీసీలో స్పోకెన్ ఇంగ్లిష్, కమ్యూనికేషన్ స్కిల్స్, కంప్యూటర్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, వేర్‌హౌస్ అసోసియేట్స్, నెట్‌వర్క్ టెక్నీషియన్ తదితర కోర్సుల్లో 2 నెలల శిక్షణ అనంతరం సామర్థ్యాన్ని బట్టి రూ. 10 వేల నుంచి రూ. 15 వేల వేతనంతో కూడిన ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతితో పాటు రెండు జతల దుస్తులు, షూస్ ఇవ్వనున్నట్లు తెలిపారు. పదో తరగతి పాసై 19 నుంచి 32 ఏళ్ల మధ్య వయస్సు గలవారు అర్హులన్నారు. పూర్తి వివరాలకు 9704350634 నంబర్‌లో సంప్రదించాలని రాజబాబు కోరారు.

రసవత్తరంగా మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక

- 13న నిర్వహించాలని కలెక్టర్‌కు ఈసీ ఆదేశాలు ?
- బీఆర్ఎస్‌కు 15, కాంగ్రెస్‌కు 13 మంది కౌన్సిలర్ల మద్దతు
- ఎన్నికలపై ఎలాంటి ప్రకటన చేయని భవేశ్‌మిశ్రా

భూపాలపల్లి మున్సిపల్ భవనం

జయశంకర్ భూపాలపల్లి, ఫిబ్రవరి 9 (నమస్తే తెలంగాణ) : భూపాలపల్లి మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నికను ఈ నెల 13న నిర్వహించాలని ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. రెండు నెలల క్రితం వైస్ చైర్మన్ పదవికి కొత్త హరిబాబు రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఈ పదవిని బీఆర్ఎస్ నుంచి గండ్ర హరీశ్‌రెడ్డి ఆశిస్తున్నారు. అయితే జిల్లా కలెక్టర్ ఎన్నిక నిర్వహించడంలో నిర్లక్ష్యం వహిస్తుండడంతో ఆయన ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఈసీ ఈ నెల 13న ఎన్నిక చేపట్టాలని కలెక్టర్ భవేశ్‌మిశ్రాను ఆదేశించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో వైస్ చైర్మన్‌ను దక్కించుకోవడానికి బీఆర్ఎస్, కాంగ్రెస్ పోటీ పడుతున్నాయి. పార్టీల పరంగా బలాబలాలను పరిశీలిస్తే మున్సిపాలిటీలో 30 వార్డులుండగా, బీఆర్ఎస్ 26, కాంగ్రెస్ 2, బీజేపీ, సీపీఐ ఒకటి చొప్పున గెల్చుకున్నాయి. ఇటీవల 11 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరడంతో వారి సంఖ్య 13కు చేరగా, బీఆర్ఎస్ కౌన్సిలర్లు 15 మంది ఉన్నారు. అలాగే ఎక్స్ అఫీషియోలుగా కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీ దయాకర్ ఉన్నారు. దీంతో బీఆర్ఎస్‌కు 17, కాంగ్రెస్‌కు 14 ఓట్లుండగా, వైస్ చైర్మన్ ఎన్నిక రసవత్తరంగా మారనున్నది. కాగా వైస్ చైర్మన్ ఎన్నిక విషయమై ఇప్పటి వరకు కలెక్టర్ ఎలాంటి ప్రకటన చేయలేదు.

సౌకర్యాల కల్పనలో అలసత్వం వద్దు

- ములుగు అదనపు కలెక్టర్ శ్రీజ
- గట్టమ్మ వద్ద పనుల పరిశీలన
- 'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన

జీపీ కార్యదర్శితో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీజ

ములుగురూరల్, ఫిబ్రవరి 9 : గట్టమ్మ ఆలయం వద్ద భక్తులకు ఏర్పాటు చేస్తున్న సౌకర్యాల్లో అలసత్వం వహించొద్దని అదనపు కలెక్టర్ పీ శ్రీజ అన్నారు. శుక్రవారం ఆమె ఆలయం వద్ద జాకారం జీపీ ఆధ్వర్యంలో చేపడుతున్న పనులను పరిశీలించారు. ఈ నెల 8న 'నమస్తే తెలంగాణ'లో 'గట్టమ్మ వద్ద వసతుల లేమి.. సరిపడా టాయిలెట్స్ లేక మహిళా భక్తుల ఇబ్బందులు' కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే.. దీనికి స్పందించిన అదనపు కలెక్టర్ గతంలో నిర్మించిన తొమ్మిది టాయిలెట్లతో పాటు అదనంగా నిర్మించిన 10 టాయిలెట్లను వినియోగించడంపై ఆరా తీశారు. ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని ఆదేశించారు. అలాగే ఆలయ సమీపంలో నిర్మిస్తున్న తాత్కాలిక టాయిలెట్లు, మరుగుదొడ్ల పనులను పరిశీలించారు. పనులు చేపడుతున్న వర్కర్ల వివరాలు, బిల్లులు సక్రమంగా ఉండేలా చూసుకోవాలని కార్యదర్శిని ఆదేశించారు. ఆమె వెంట డీఆర్వో సత్యపాల్‌రెడ్డి, జాకారం మాజీ సర్పంచ్ దసరి రమేశ్ ఉన్నారు.

ఎదురుపిల్ల పండుగ లక్ష్మీదేవరలకు ఆహ్వానం

ములుగురూరల్, ఫిబ్రవరి 9 : గట్టమ్మ దేవాలయం వద్ద ఈ నెల 14న నిర్వహించే ఎదురుపిల్ల పండుగకు రావాలని లక్ష్మీదేవర పూజారులు, ఆదివాసీ నాయకపోడు కులస్తులను శుక్రవారం ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆదివాసీ నాయకపోడు ములుగు జిల్లా అధ్యక్షుడు, గట్టమ్మ ప్రధాన పూజారి కొత్త సురేందర్ మాట్లాడారు. ఆదివాసీ నాయకపోడు ఆచార, సంస్కృతి, సంప్రదాయాలు ఇతర ఆదివాసీలకంటే భిన్నంగా ఉంటాయన్నారు. పాండవుల వంశంగా ఉన్న ఆదివాసీ నాయకపోడు కులస్తులు నేటికీ లక్ష్మీదేవరల ప్రతిమల పంచ పాండవులను పూజిస్తారని తెలిపారు. ఎదురు పిల్ల పండగకు జిల్లాలో ఉన్న 19 లక్ష్మీదేవరలకు ఆహ్వాన పత్రికను అందించే కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన చెప్పారు. మొదటి రోజు జిల్లాలోని 11 లక్ష్మీదేవరల పూజారులకు ఆహ్వాన పత్రిక ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో గట్టమ్మ ప్రధాన పూజారి కొత్త సదయ్య, కొత్త లక్ష్మయ్య, ఆకుల మొగిలి, అరిగెల సమయ్య, ఆకుల రాజు, అచ్చ రాజు, కొత్త రమేశ్, పిట్టల మల్లేశ్, రాజశేఖర్, కుమార్, సాంగం స్వామి, కోటనర్సింహం, సారంగపాణి, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎదురుపిల్ల పండుగ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆదివాసీ పూజారులు

సమావేశంలో మాట్లాడుతున్న మైనింగ్ డైరెక్టర్ ఉమేశ్ మధుకర్‌రావు

ప్రమాద రహిత బొగ్గు ఉత్పత్తికి కృషి చేయాలి

మైనింగ్ డైరెక్టర్ ఉమేశ్ మధుకర్‌రావు

భూపాలపల్లి రూరల్, ఫిబ్రవరి 9: నియమ నిబంధనలు పాటిస్తూ ప్రమాద రహిత బొగ్గు ఉత్పత్తికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మైనింగ్ డైరెక్టర్ ఉమేశ్ మధుకర్‌రావు సూచించారు. శుక్రవారం సింగరేణి ఇల్లందు క్లబ్ హౌస్‌లో సింగరేణి భూపాలపల్లి ఏరియా జీఎం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సేఫ్టీ రివ్యూ మీటింగ్ నిర్వహించగా, మెకానికల్ డైరెక్టర్ ఎస్‌జీ బైసారే, ఎలక్ట్రికల్ డైరెక్టర్ ఎస్ ఆనందవెల్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ మైన్స్ జార్జ్ జాన్, డిప్యూటీ మైనింగ్ డైరెక్టర్లు సనత్ కుమార్, కమలేశ్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మధుకర్‌రావు మాట్లాడుతూ సింగరేణి సంస్థలోని భద్రతాపరమైన సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో అధికారులు హరినారాయణ, ఎస్ కవీంద్ర, టీ వెంకటరామిరెడ్డి, ఏఐటీయూసీ నాయకులు ఎం రమేశ్, ఐఎన్‌టీయూసీ నాయకులు జోగబుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

వాజేడు, ఫిబ్రవరి 9 : మండలంలోని ధర్మవరంలో ఎరువులు, పురుగు మందుల దుకాణాలను శుక్రవారం జిల్లా వ్యవసాయ అధికారి గౌస్ హైదర్ ఆకస్మిక తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లు పరిశీలించారు. ఈపాస్ మిషన్ ద్వారా ఎరువుల విక్రయాలు చేయాలని, ప్రతి రైతు ఆధార్ కార్డు ద్వారా ఎరువులు కొనుగోలు చేయాలని సూచించారు. స్టాక్ రిజిస్టర్లు రెగ్యులర్‌గా అప్డేట్ చేయాలని, అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని వ్యాపారులను హెచ్చరించారు. అనంతరం ఆయన మిరుప తోటలను పరిశీలించి తోటల్లో కొమ్మ కుళ్లు ఉన్నట్లు గుర్తించారు. ఇందుకు సంబంధించిన మందులను తెలిపి పిచికారీ చేయ ఆలని రైతులకు సూచించారు. ఆయన వెంట జిల్లా టెక్నికల్ వ్యవసాయ అధికారి వాజిద్, ఏవో నర్సింహారావు, ఏఈవోలు హరీశ్, జాఫర్ ఉన్నారు.

'దళిత బంధు' నిధులు తక్షణమే విడుదల చేయాలి

డీబీ ఐక్య పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కోగిల మహేశ్

వెంకటాపురం(నూగూరు), ఫిబ్రవరి 9 : దళిత బంధు నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని దళిత బంధు ఐక్య పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కోగిల మహేశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ఆవరణలో నిర్వహించిన సమావేశంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండో విడుత దళిత బంధు నిధులు విడుదల చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కన్వీనర్, కోశాధికారి చిట్టిమల్ల సమ్మయ్య, ఉపాధ్యక్షుడు నావుళ్ల సంపత్, నాయకులు మడికొండ రమేశ్, కే చిన్నికృష్ణ, సంజీవ, రాజాబాబు, కొండయ్య, శ్రీకాంత్, రవి, ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ఆశ వర్కర్ల నిరసన

భూపాలపల్లి రూరల్, ఫిబ్రవరి 9 : ఆశ వర్కర్ల పెండింగ్ పారితోషికాలు తక్షణమే చెల్లించాలని కోరుతూ శుక్రవారం కలెక్టట్ ముందు నిరసన చేపట్టారు. అనంతరం ఏవో మహేశ్‌బాబుకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆశ వర్కర్లు మాట్లాడుతూ గతంలో ప్రతి నెల 2వ తేదీన పారితోషికాలు అకౌంట్‌లో పడేవని, రెండు నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేయడం లేదన్నారు. ఆశలకు ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని, మహాలక్ష్మి వంటి సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని వారు కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సాయిలు, వెలిశెట్టి రాజన్న, ఆశలు రాధిక, సరిత, శైలజ, విజయ, లావణ్య, కుమారి, సునీత పాల్గొన్నారు.

జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఆశ వర్కర్లు

ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తుల ఆహ్వానం

భూపాలపల్లి రూరల్, ఫిబ్రవరి 9 : ఎస్సీ విద్యార్థులు ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్ కోసం మార్చి 31లోగా దరఖాస్తు చేసుకోవాలని భూపాలపల్లి ఎస్సీ అభివృద్ధి అధికారి సునీత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న అర్హులైన విద్యార్థులందరూ వినియోగించుకొని http://telanganaepass.cgg.gov.in ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆమె పేర్కొన్నారు.

మేడారం పనుల్లో అలసత్వం

వాజేడు, ఫిబ్రవరి 9 : మేడారం జాతర సమీపిస్తున్నా పనులు చేపట్టడంలో ప్రభుత్వం అలసత్వం వహిస్తున్నదని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు బండారు రవికుమార్ అన్నారు. మండలంలోని పూసూరు గోదావరి బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతర పనులు ఆలస్యంగా చేపట్టడంతో త్వరగా పూర్తిచేయాలనే పేరుతో కాంట్రాక్టర్లు నాణ్యతకు తిలోదకాలు ఇస్తూ కోట్ల రూపాయలు దండుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. మేడారం పరిసర గ్రామాల్లో యాసంగి పంట వేయకుండా రైతులు నష్టపోయారని, వారిని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. పూర్తికాని రహదారుల పనులు యుద్ధప్రాతిపదికన చేపట్టి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు సూడి కృష్ణారెడ్డి, తుమ్మల వెంకటరెడ్డి, బిరెడ్డి సాంబశివ, రత్న రాజేందర్, ఎండీ దావుద్, వంక రాములు, కొప్పుల రఘుపతి, చిట్టిబాబు, రాజేశ్, దుర్గి చిరంజీవి, ఆగిరెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వైజ్ఞానిక పోటీలకు అక్షిత ఎంపిక

వెంకటాపూర్, ఫిబ్రవరి 9 : మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల విద్యార్థిని బీ అక్షిత రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం రాధిక తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొన్న అక్షిత డ్రైనేజీ పైపుల్లోకి పాములు, ఎలుకలు రాకుండా ఎలా అరికట్టాలో వివరించి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు చెప్పారు. అక్షితను హెచ్ఎం, ఉపాధ్యాయులు బాబురావు, కిరణ్, అంబేద్కర్ అభినందించారు.

లింగ వివక్షను రూపుమాపాలి

మల్హార్, ఫిబ్రవరి 9 : బాలబాలికల్లో ఉన్న లింగ వివక్షను రూపుమాపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మిషన్ శక్తి ఇన్‌చార్జి కోఆర్డినేటర్ అనూష అన్నారు. శుక్రవారం మండలంలోని తాడిచర్ల జడ్పీ పాఠశాలలో బేటీ బచావో.. బేటీ పడావోపై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఎంపీపీ మల్హార్‌రావుతో కలిసి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా అనూష మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన తర్వాతే వివాహాలు జరిపించాలన్నారు. బాలికలు తమ హక్కులకు భంగం కలిగితే 1098, మహిళలు ఆపద సమయంలో 181, వృద్ధులు 14567 నంబర్లను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరస్వతి, హెచ్ఎం భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కొడుకు చేసిన అప్పు తీర్చమన్నందుకు ఆత్మహత్య

గణపురం, ఫిబ్రవరి 9 : కొడుకు చేసిన అప్పు తీర్చమన్నందుకు తల్లి ఆత్మహత్య చేసుకున్నది. మండలంలోని వెంకటేశ్వర్లపల్లికి చెందిన దొంతరవేణి సమ్మక్క (68) పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడింది. ఎస్సై మచ్చ సాంబమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. సమ్మక్క కుమారుడు స్వామి డ్రైవర్‌గా పనిచేస్తూ రేగొండ మండలం భాగిర్ధిపేటలో జీవిస్తున్నాడు. రెండేళ్ల క్రితం తన స్వగ్రామం వెంకటేశ్వర్లపల్లికి చెందిన కీర్తి వీరయ్య వద్ద రూ. 40 వేలు అప్పు తీసుకున్నాడు. అనారోగ్య కారణాలతో అతడికి డబ్బులు ఇవ్వలేకపోయాడు. దీంతో కొడుకు చేసిన అప్పు తీర్చాలని గ్రామంలో ఉన్న స్వామి తల్లి సమ్మక్కను వీరయ్య దుర్భాషలాడాడు. దీంతో అవమానం తట్టుకోలేక సమ్మక్క బుధవారం పురుగుల మందు తాగింది. ఆమెను గ్రామస్తులు ములుగు సివిల్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం రాత్రి సమ్మక్క మృతి చెందింది. తన తల్లి చావుకు వీరయ్య కారణమని స్వామి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వీరయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాంబమూర్తి తెలిపారు.

జంగాలపల్లి టూ గణపురం

క్రాస్‌రోడ్డును విస్తరించాలి

వెంకటాపూర్, ఫిబ్రవరి 9 : జంగాలపల్లి టూ గణపురం క్రాస్ రోడ్డును విస్తరించాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి ఢిల్లీలో రామప్ప పరిరక్షణ కమిటీ కన్వీనర్ ఆకిరెడ్డి వెంకట రామ్మోహన్‌రావు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మంత్రికి ఎన్‌హెచ్ 163 నుంచి ఎన్‌హెచ్ 350సీ వరకు ఉన్న రోడ్డును ఆరు లైన్లుగా విస్తరించడం వల్ల రామప్పకు వచ్చే పర్యాటకులకు ఎంతో అనుకూలంగా ఉంటుందన్నారు. అంతేకాకుడా రెండు జాతీయ రహదారులను కలిపినట్లవుతుందని మంత్రికి వివరించారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించి ఆ రహదారిని నేషనల్ హైవేలోకి తీసుకువచ్చి విస్తరిస్తామని హామీ ఇచ్చినట్లు రామ్మోహన్‌రావు తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న మల్టీజోన్ ఐజీ తరుణ్‌జోషి

మేడారం జాతరలో 500 సీసీ కెమెరాలు

- ప్రత్యేక బృందంతో బందోబస్తు
- మల్టీ జోన్ ఐజీ తరుణ్‌జోషి

తాడ్వాయి, ఫిబ్రవరి 9 : మేడారం జాతరలో నేరాల కట్టడికి 500 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు 500 మంది సీసీఎస్, స్పెషల్ బ్రాంచ్ అధికారులతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయనున్నట్లు మల్టీ జోన్ ఐజీ తరుణ్‌జోషి తెలిపారు. బుధవారం మేడారం హరిత హోటల్‌లో నోడల్ అధికారులకు నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరయ్యారు. గత జాతరలో ఎదురైన సవాళ్లు వాటి పరిష్కారాల దిశగా చర్చించారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ డ్యూటీ పాయింట్లలో పాటించాల్సిన జాగ్రత్తలు వివరిస్తూ భక్తులతో ఓపికగా వ్యవహరించాలని సూచించారు. ట్రాఫిక్ నిర్వహణ చాలెంజింగ్‌గా ఉంటుందన్నారు. ఈసారి జాతరకు కోటీ యాభై లక్షల మందికి పైగా భక్తులు సుమారు 5 లక్షల వాహనాల్లో వచ్చే అవకాశం ఉందన్నారు. దానికి అనుగుణంగా వాహనాలను పార్కింగ్ స్థలాలకు మళ్లించడం వల్ల ట్రాఫిక్ జామ్ కాకుండా చూడొచ్చన్నారు. ట్రాఫిక్ క్లియరెన్స్‌లో భాగంగా 100కు పైగా బైక్‌లు ఏర్పాటు చేశామని, ఎక్కడైనా యాక్సిడెంట్ జరిగితే అంబులెన్స్ లేదా పోలీస్ వాహనాల్లో వారిని వెంటనే దవాఖానకు తరలించాలన్నారు. క్యూ లైన్ వద్ద భక్తులు ఎక్కువసేపు వేచి ఉండకుండా త్వరగా కదిలేలా పుషింగ్ పార్టీలను నియమించామన్నారు. కమాండ్ అండ్ కంట్రోల్ రూమ్ సెంటర్ నుంచి సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షించనున్నట్లు చెప్పారు. ములుగు ఎస్పీ శబరీశ్ మాట్లాడుతూ ఈవ్ టీజింగ్ సమస్యలు తలెత్తకుండా షీటీం, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ నుంచి మహిళా సిబ్బందిని కేటాయించామన్నారు. డ్యూటీ పాయింట్ వద్ద ఇతర డిపార్ట్‌మెంట్ల అధికారులతో సమన్వయంతో పని చేయాలని సూచించారు. సమావేశంలో వికారాబాద్, భూపాలపల్లి ఎస్పీలు కోటిరెడ్డి, కిరణ్ ఖరే, ములుగు ఓఎస్డీ అశోక్ కుమార్, ఏటూరునాగారం ఏఎస్పీ సంకీర్త్ పాల్గొన్నారు.

పేరుకే నిషేధం

గట్టమ్మ వద్ద సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విక్రయాలు

గట్టమ్మ వద్ద సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లలో పూజా సామగ్రి విక్రయిస్తున్న వ్యాపారి

ములుగు రూరల్, ఫిబ్రవరి 9 : గట్టమ్మ దేవాలయం వద్ద సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. వ్యాపారులు కొబ్బరి కాయలు, లడ్డు, హోటల్, ఇతర విక్రయాలను ప్లాస్టిక్ కవర్లతో జరుపుతున్నారు. అధికారులు 'ప్లాస్టిక్‌ను నిషేధిద్దాం –పర్యావరణాన్ని కాపాడుదాం' అంటూ వాల్ పేయింట్‌లు, బ్యానర్లు కట్టి చేతులు దులుపుకుంటున్నారే తప్పా ఆచరణలో పెట్టడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇందుకు ఉదాహరణ గట్టమ్మ వద్ద వ్యాపారులు విచ్చలవిడిగా సింగిల్ యూస్ ప్లాస్టిక్ కవర్లలో సామగ్రి ఇస్తున్నా పట్టించుకోవడంలేదు. ఓ పక్క సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు మేడారంలో ప్లాస్టిక్ కవర్లు వాడడం, విసిరివేయడం నిషేధమని చెప్తున్నా, అధికారులు భక్తులకు అవగాహన కల్పించలేకపోతున్నారు. భక్తులకు జూట్ బ్యాగులు, బట్ట సంచులు ఇవ్వాల్సి ఉండగా గట్టమ్మ వద్ద అవేమీ కనిపించడం లేదు. అధికారుల పర్యవేక్షణ లోపంతోనే వ్యాపారులు విచ్చలవిడిగా ప్లాస్టిక్ వాడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ప్లాస్టిక్ కవర్ల వాడకంపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సారలమ్మ ఆలయాన్ని సందర్శించిన పీవో

పెయింటింగ్, లైటింగ్ పనుల పరిశీలన

ఏటూరునాగారం, ఫిబ్రవరి 9 : కన్నెపల్లి గ్రామంలోని సారలమ్మ ఆలయాన్ని శుక్రవారం ఏపీవో వసంతరావు, ఎస్‌వోతో కలిసి ఐటీడీఏ పీవో అంకిత్ పరిశీలించారు. పెయింటింగ్, లైటింగ్ పనుల పురోగతి తెలుసుకున్నారు. ఆదివాసీ గిరిజన సంస్కృతీ ఉట్టిపడేలా పనులు జరగాలని అధికారులను ఆదేశించారు. సారలమ్మ దేవాలయం వద్ద ఉన్న బ్యాటరీ ఆఫ్ టాప్స్, చేతిపంపుల పనితీరును స్వయంగా పరిశీలించి సూచనలు చేశారు. ఆదివాసీ కోయ పెయింటింగ్ పనులు, హట్స్‌ను పరిశీలించి పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. ఇంగ్లిష్ మీడియం స్కూల్ వద్ద ఉన్న శానిటరీ వర్కర్ల వివరాలు తెలుసుకున్నారు. జాతర పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ బ్లీచింగ్ చేయాలన్నారు. నిత్యావసర సరుకులు, వంట పనుల విషయంపై జీసీసీ అధికారులతో మాట్లాడారు.అన